# కలల ఖరీదు

"రచయిత మధుసూదనంగారు... మీరేకదూ?"

ఆశ్చర్యంగా ఆగంతకుడివంక చూసి అన్నాడతను "అవును. మీరు...?"

"నాపేరు రంగారావ్. మీ కథలంటే నాకు చాలా యిష్టం. కుక్కగొడుగుల మాదిరి పుట్టుకొస్తున్న నేటి రచయితల మధ్య...సారీ.. మీరు చాలా ప్రత్యేక రచయితలు... నిజంగా మీ కథలంటే ఎంతో అభిమానం నాకు. మొన్నఅచ్చయిన హారతి... అద్భుతం... నాకు తెలిసినంత వరకూ మీరు ఎక్కువ కథలు వ్రాయలేదు... ఔనా?''

"ఊఁ. ఐదారు ప్రచురించబడ్డాయ్."

"గంగిగోవుపాలు గంటెడైనను చాలు. పది చెత్తకథలూ ఓ మంచికథా వ్రాయడంకంటె, ఓ మంచికథరాసి ఊరుకోడం సాహిత్యానికి మేలు చేసినట్లవుతుంది. బ్రతుకుతీపి కథలో మీరు చివర యిచ్చిన ముగింపు ఎంత బ్రహ్మాండంగా ఉందని! మళ్ళీ ఓహెన్రీ, హెమింగ్వే బ్రతికి వచ్చారా అనిపించింది."

"థాంక్స్.'' సంబరపడిపోతూ అన్నాడు మధు.

"మీరేమీ అనుకోరంటే..."

"చెప్పండి.'' ఆత్రుతగా అన్నాడు మధు.

"ఎప్పటికీ యిలాగే కథకు క్వాలిటీ మెయిన్‌టెయిన్ చెయ్యండి. పదికథలు వ్రాసేసి పాప్యులర్ అవాలని తాపత్రయ పడకండి. పత్రికలు తలుచుకుంటే ఎంత చెత్తరచయితనైనా పాప్యులర్ చెయ్యగలవు. కాని ఓ మంచికథ వ్రాయించడం ఎవరితరమూకాదు. పాప్యులర్ రైటర్‌కీ మంచి రైటర్‌కీ వ్యత్యాసం మీకు నేను చెప్పాలా? మీవి నాలుగుకథలు చదివాను. ఎంత నచ్చాయో చెప్పలేను. నిజంచెప్తే మిమ్మల్ని పొగడినట్లు పొరబడతారు. ఆకలితీరని మనిషిలో శేఖరం అచ్చంగా నేటి సగటుమనిషికి ప్రతిబింబం. పోతే

ఇచ్ఛాపురపు రామచంద్రం

బ్రతుకు బరువులో మాత్రం మీరు చాలా ఆవేశపడ్డారనిపించింది. ప్రతి పదమూ, ప్రతి వాక్యమూ పాఠకుడి గుండెల్లోకి గురిచూసిన బాణమే! ఏ విషయమైనా మెత్తగా చెప్పాలి కాని బెదిరించి భయపెట్టి చెప్పడం మంచిదికాదని నా వ్యక్తిగతాభిప్రాయం. శైలిలో తీవ్రతను చాలా మెచ్చుకున్నాను చదువుతూ. కాని, మీరు యువకులు. మీ ఆలోచనలు చాలా ఫార్వర్డ్; సంఘాన్ని సంస్కరించే కథలు వ్రాసేటప్పుడు సెంటిమెంట్స్‌ని చీల్చి చెండాడే ప్రయత్నం చేయడం కంటె - ఆదర్శమైన భవిష్యత్తుని పాఠకుడి కళ్ళముందు మెదిలించడం వలననే ఎక్కువ ప్రయోజనం సాధించవచ్చు ననుకుంటాను. సారీ .. మీలాటి రచయితలకు సలహా ఇవ్వగలిగే సమర్థత నాలో లేదు. కాని ... మిమ్మల్ని కలుసుకున్న ఆనందంలో..."

"పరవాలేదు. మీ సలహా సమంజసమే. మీరు నన్ను సరిగ్గానే అర్థం చేసుకున్నారు. పదండి. కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం..."

"కేవలం వయసులో పెద్దరికాన్ని పురస్కరించుకుని మీకో చిన్న మాట చెప్పాలనుకుంటున్నాను." రంగారావ్ సంశయిస్తున్నట్లు ఆగాడు.

"చెప్పండి. నా దగ్గర మీరేమీ సందేహించనవసరంలేదు. నాలుగైదు కథలు వ్రాశానన్నమాటేకాని నాకు అభిమాన పాఠకులంటూ ఏర్పడలేదు. పెద్దపత్రికలు అచ్చేసుకోవడమూలేదు."

"అలా ఆలోచించకండి. వ్యాపార సరళిలో సాగే పత్రికలకు కథల విలువతో పనేమిటి! ఆడపిల్లలు రాస్తేనే బహుమతులు. అటినే సాహిత్యమంటున్నారు. నిజానికి మంచికథ అనేది ఏ పత్రికలో అచ్చయినా, ఎవరు వ్రాసినా అది మంచికథే. వజ్రం విలువ తెలుసుకుందుకు అందరికీ వశమా? అయినా మన పాఠకులలోనూ చాలా లోపముంది. అచ్చులో పేరు చూసుకుందామన్న ఆత్రుతలో జడ్డమైన కథనీ అభినందించేయగమే! కొందరేమో పంచరత్నాలలాటి పద్యాలతో కథని మెచ్చేసుకుని తమ కవితామాధుర్యాన్ని వెల్లడించుకుంటాడు! వాళ్ళ తాపత్రయం - బహుశా - పది ఉత్తరాలు రాశాక ఓ కథ వేసుకోరా అని కావచ్చు."

పెసరట్ త్రుంచుతూ ఆగాడు రంగారావ్.

"మీ మాటలు వింటూంటే మీకు వర్తమాన సాహిత్యంతో చాలా టచ్ ఉన్నట్లుంది." పెసరట్ నములుతూనే అన్నాడు మధు.

"కరక్ట్‌గా ప్రెడిక్ట్ చేశారు. నిజానికి సాహిత్యంలో పుట్టాను. అందులో పెరిగాను. సాహిత్యంలోనే జీవిస్తున్నాను."

"క్షమించి వివరించాలి."

"మా నాన్నగారు గ్రంథకర్తలు.

ఐదోయేట అక్షరాభ్యాసంతోపాటు గ్రంథ పఠనమూ అలవాటు చేశారు. అప్పటికి ఆరోగ్యం బాగుండేదికాదు. ఆటలాడే ఓపికలేక తెగ చదివాను పుస్తకాలు. పదిహేనేళ్ళపాటు ప్రపంచ సాహిత్యాన్ని మథించాను. ఓహెన్రీ, హెమింగ్వే, ఎడిత్ వార్టన్, జేమ్స్‌జాయిస్, గోర్కీ, దాస్తొవెస్కీ, పుష్కిన్, ఛెకోవ్, మిల్టన్, బైరన్, కీట్స్, మపాసా, షేక్స్పియరు, షా, ఆస్కార్‌వైల్డ్, మామ్ - కొన్ని పేర్లు మరిచిపోయాను వాళ్ళందర్నీ క్షుణ్ణంగా చదివాను. అప్పుడే తెలిసింది కొంత. ఓకథ ప్రారంభిస్తూ ఓహెన్రీ ఏమంటాడో తెలుసా? నిజమైన కథకు ఫ్లాష్‌బ్యాక్ ఉండక పోవడం మేలంటాడు ప్రస్తుతం తెలుగు కథలలో ప్రేమా, ఫ్లాష్‌బ్యాకూ లేనివి- ఎవరో మీలాటివారు తప్ప ఎవరువ్రాస్తున్నారు! నిజంగా కథ లక్షణాలనుబట్టి శల్య పరీక్ష చేస్తే మనవాళ్ళ కథలలో ఎన్ని నిలబడతాయ్? ఏడాదికివచ్చే నిజమైన కథలు వేళ్ళమీద లెక్కపెట్టెయ్యొచ్చు. అసలు ప్రాథమికంగా మన వాళ్ళలో వెరైటీయే కరువైపోతూంది. ఎంతసేపూ ఎండమావిలాటి ప్రేమతప్ప మరేమీ కనిపించడంలేదు కథకిప్రాణం సంభాషణ అనేది ఎందరికి తెలుసు? ఏదో రాస్తున్నారు. పత్రిక లచ్చువేసి అమ్ముకుంటున్నాయ్. పాఠకులూ రచయితలూ ప్రచురణకర్తలూ పోటీలు పడి స్థాయి దిగజారుతున్నారు. ఒక్క నిజం చెప్తాను. కోపగించుకోనంటే..."

"చెప్పండి..."

"ఇప్పుడు మన రచయితల ఆశయాలూ దృక్పథాలూ మారిపోయాయ్. పది కథలు రాసెయ్యాలి నాలుగు డబ్బులు సంపాదించాలి. ఎలాగో ఓలా సినిమాల్లోకి దూరిపోవాలి. అంతే. చాలా మంది ధ్యేయం యిదే అయిపోయింది. మీకూ తెలుసు..."

"అవును..." కాదనలేకపోయాడు మధు.

"కాఫీ తెమ్మంటారా?" సర్వర్ కలుగజేసుకున్నాడు.

"ద్రాక్ష తీసుకురా." ఆర్డరిచ్చాడు మధు.

"ఇంతకీ నేను వచ్చినపని చెప్పనేలేదు. మధుసూదనరావ్‌గారూ, నవతా పబ్లికేషన్స్ పేరు విన్నారా?"

"లేదు." అపరాధిలా అన్నాడు మధు.

"అవును. యిన్నాళ్ళూ మేము మంచి పుస్తకాలు వెయ్యలేకపోయాం. ఇక మంచి మీ వంటి మంచిరచయితల పుస్తకాలు వేద్దామని సంకల్పించుకున్నాం. అట్టమీద బొమ్మ అందంగా వేసియిన్నాళ్లూ పుస్తకాలు వేశాం కాని...యిక... అకాడమీ బహుమతుల కర్హమైన రచనలే అచ్చు వెయ్యాలనుకుంటున్నాం కేవలం అందమైన బొమ్మ చూపి

పుస్తకం అంటగట్టి దురాచారానికి స్వస్తి చెప్పి - విలువైన పుస్తకం వేయాలని గట్టిగా తీర్మానించుకున్నాం. అందుకు మీవంటి మంచిరచయితల సహకారం చాలా అవసరం."

మధు ఆనందానికి మేరలేదు.

నాలుక్కథలు రాసేసరికే పబ్లిషరు తనని వెదుక్కుంటూ వచ్చాడు! నిజంగా ఎంత విలువైనవో తన కధలు?

"మా ఆశయం మీ రర్థం చేసుకునే ఉంటారు. నవతా ప్రచురణ లిక ఉత్తమ రచనలు వెలువరించి పేరు తెచ్చుకుం టుంది. సాహిత్యానికి నిజమైన సేవ చేస్తుంది."

"శుభం."

"అలా అనేస్తే చాలదు. మీ కధ లివ్వాలి. మీ రచనలను సంకలనం వేస్తాము ఇంతవరకూ మేము పేజీ కింత అని యిస్తున్నాం. మీకు రాయల్టీ ఏర్పాటు చేస్తాం. ఒక్క అచ్చుతప్పు లేకుండా, సరసమైన వెలలో, చక్కని గెటప్‌లో మంచి పుస్తకం పాఠకుల కందించడమే మా ఆశయం ఈ ప్రణా ళికకు మీ రంకురార్పణ చేయాలి..."

ఆనందంలో తేలిపోతున్నాడు మధు.

"మరి... మీ రంగీకరించినట్లేనా? రూముకిపోయి అగ్రిమెంటు రాసేసు కుందాం. అడ్వాన్స్‌గా ఓవందరూపాయ లివ్వగలం. పుస్తకం అచ్చుకాగానే - సంవత్సరాంతానికి లెక్కలు చూసు కుందాం.

మంచి పుస్తకాలు వేయడం మీతో ప్రారంభిస్తున్నాం. మీరు మీ భావిరాల్యా రచనలన్నిటినీ మా ప్రచురణల ద్వారానే..."

మధు సంతోషం పట్టనలవికాకుండా ఉంది. "శాశ్వతంగా మా సంబంధాలు కొనసాగా లంటారు అంతేగా; అలాగే చేద్దాం."

"రైట్. పదండి. మీ యింటికిపోయి అగ్రిమెంట్ రాసేసుకుందాం."

మధుసూదనరావూ రంగారావూ బిల్లు కోసం సభ్యత చెడనంతవరకూ పోట్లాడు కున్నారు.

"మీరే గెలిచారు_" సీరసంగా అనే శాడు రంగారావ్ - చిరునవ్వుతో మధు బిల్ చెల్లిస్తూంటే.

"మీరు అతిధులు."

"అదికాదు, మీవంటిరచయితలని."

"డోన్ట్‌మైండ్ ఇంటికి పోదాం పదండి."

ఇద్దరూ మధు రూము చేరుకున్నారు. రెండు నిముషాలలో అగ్రిమెంట్ పకడ్బందీగా రాసేశాడు రంగారావ్

"మీరు అక్‌నాలెడ్జిమెంట్ వ్రాయండి వందరూపాయలకి..." అంటూ జేబు లోకి చెయ్యి పోనిచ్చాడు రంగారావ్.

రసీదందించబోతూ అతని ముఖం లోకి చూశాడు మధు

కొయ్యబొమ్మలా మిగిలిపోయాడు రంగారావ్.

ఆశ్చర్యంలో పడి ఆటుకి నెత్తురు బొట్టు లేదు.

"ఏమైంది?" ఆత్రుతగా అడిగాడు మధు

"ఎ...మీ... కాలేదు..." సీళ్ళు నములుతూ అన్నాడు రంగారావ్ "క్షమించండి. నాకు శలవిప్పించండి రెండు రోజులలో మళ్ళీ వస్తాను."

"ఏమైందంటే చెప్పరేం?"

"ఊహుఁ"

"అరె! ఏం జరిగిందో చెప్పమంటే చెప్పరేం విడియపడతారేం?" రెట్టించాడు మధు.

సిగ్గుపడిపోతూ అన్నాడు రంగారావ్ "ఎవడో దొంగవెధవ జేబుకొట్టేశాడు" అంటూ చినిగినజేబు చూపాడు.

"అయ్యో! ఎంత పోయింది?" ఆత్రుతగా అడిగాడు మధు

"అబ్బే! రెండువందలు."

"రెండువందలే?"

"రెండువందలు పోయిందనికాదు. ఇంతవరకూ వచ్చాక... యిలా జరగడం బాధగా ఉంది. మీ రిదేమీ మనసులో పెట్టుకోకండి. నేను నాలుగైదు రోజులలోవచ్చి మీకు డబ్బు చెల్లించి మీ రచనలు తీసుకుంటాను. దయచేసి మీరు మరోలా భావించరుకదూ?"

"ఛ ఛ అదేమిటి? ఇటువంటివి జరిగితే ఎవరుమాత్రం ఏం చేయగలరు?"

"సరే. థాంక్స్. నాకు శలవిప్పించండి"

"జేబులో చిల్లిగవ్వలేకుండా ఎలా వెళ్తారు?"

ప్రశ్న వినబడనట్లు నిలబడి పోయాడు రంగారావ్

"మీరు విజయవాడవెళ్ళాలి. ఔనా!"

"ఊఁ"

"ఎందుకలా మొహమాటపడతారు? ఈ రాత్రి కిక్కడ ఉండి తెల్లవారేక వెళ్దురుగాని"

"ఆదకాదు ...రేపటికి వెళ్ళిపోవాలి."

సరే, యీ పాతికా ఉంచండి. పదండి స్టేషన్ వరకూ వస్తాను"

విచారంగా అన్నాడు రంగారావ్: "మీకు యివ్వవలసింది పోయి మీవద్ద నుంచి తీసుకున్నాను క్షమించాలి. నాలుగురోజులలో..."

"అలాగేలెండి." నవ్వాడు మధు.

తనే టికట్ కొనిచ్చి రైలెక్కించాడు

మధు అతన్ని. పాతికా పైఖర్చు కంటా యన్నాడు.

నాలుగురోజులు గడిచాయ్ - రంగా రావ్ రాలేదు కాని అతనిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"శ్రీ మధుసూదనరావ్‌గారికి :

చాలా కృతజ్ఞతలు. బహుశా మీరు నాకోసం ఎదురుచూస్తుంటారు సారీ.

జేబు చిరిగిన సిల్కు చొక్కా: నోటి నిండా కబుర్లు - వీటితో మోసగించ డానికి రచయితలైన మీరుతప్ప మరెవరూ దొరకలేదు మీ ఆతిథ్యానికి ఆదరానికి కృతజ్ఞతలు వెనక్కితిరిగి చూసే అల వాటు లేదు కానీ ఎందుకో మీ మంచి తనంచూసి మీకు నిజం చెప్పెయ్యాలని పిస్తుంది. సార్థకనామధేయుడైన అప్పా రావ్‌నిమించినవాణ్ణి నేను. అప్పుతీసుకునే అలవాటులేదు. కారణం తీర్చలేకపోయే అసమర్థత. అందుచేత అచ్చంగానే తీసేసుకుంటాను.

మీ దగ్గరికి పబ్లిషర్‌లా వచ్చాను. ఆపాత్రను సమర్థవంతంగా నటించగలి గేందుకు కొంత శ్రమపడి మీ కథలు చదవడమూగట్రా చెయ్యాల్సివచ్చింది. అఫ్‌కోర్స్. కష్టం బాగానే కిట్టింది ఉదరపోషణార్థం కాకపోయినా ఈ లోకంలో జాలీగా బతకాలంటే మనిషి కష్టపడి కథలు వ్రాసి లాభం లేదు. జీవితం ఓ జూదం. న్యాయంగా ఆడితే గెలవడం అసాధ్యం.

ఈపాటికి నేనేమిటో అర్థమై ఉంటుంది కనుక - ఇక నవతాపబ్లిషర్స్ కోసం ఆలోచించరనే ఆశిస్తాను. నాకు తెలిసినమేరకు ఆ పేరుతో అటువంటి సంస్థేదీ లేదు విజయవాడలో. విష్ యు గుడ్‌లక్ మైడియర్ రైటర్ మీ కథలు ఫరవాలేదు. మీరంటే జాలివేస్తుంది కనుక మిమ్మల్ని మళ్ళీ కలుసుకోకూడ దనే కోరుకుంటున్నాను. అది ఉభయు లకూ శ్రేయస్కరం.

ఇక శెలవ్

భవదీయుడు.

మధుసూదనరావ్‌కి ఏడుపురాలేదు

ఈ నాలుగురోజులూ తనుకన్న కలల ఖరీదు నలభై రూపాయలు చాలా స్వల్పమే అనిపించింది.